క్లుప్తంగా

పొంగిన ఊర చెరువు



గుంకలాం గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డుపై పారుతున్న నీరు

విజయనగరం రూరల్: మండలంలోని ద్వారపూడి గ్రామం నుంచి గుంకలాం గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న ఊరచెరువు పొంగి పొర్లడంతో రోడ్డు మీదుగా నీరు పారుతోంది. సుమారు నడుం లోతు నీళ్లు పారుతుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఇరు గ్రామాలకు చెందిన ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ముంపు ప్రాంతంలో ఎమ్మెల్యే పర్యటన



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

పూసపాటిరేగ: మండల కేంద్రమైన పూసపాటిరేగ హైవే సమీపంలో ముంపు ప్రాంతాన్ని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి సోమవారం పరిశీలించారు. హైవే నుంచి పెదచెరువులోకి నీరు వెళ్లేందుకు శాశ్వత చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ మేరకు సాధ్యాసాధ్యాలను తహసీల్దార్ తాడ్డి గోవిందతో చర్చించారు. ఆమెతో పాటు ఆర్ఐ పి. మాధురి, మాజీ సర్పంచ్ సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మేము సైతం..



బాధితులకు ఆహార పొట్లాలను అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

విజయనగరం రూరల్: విజయవాడ వరద బాధితులకు అండగా మేము సైతం అంటూ మండలంలోని జొన్నవలస గ్రామానికి చెందిన హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ సభ్యులు సేవలందిస్తున్నారు. విపత్కర పరిస్థితుల్లో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు ఆహార పదార్థాల నుంచి ఆరోగ్యపరమైన మందుల వరకు అన్ని రకాల సేవలను అందిస్తున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు కోరాడ రాంబాబు, ఉపాధ్యక్షుడు బూర్లె సతీష్, జి.జ్ఞానేశ్వర్, ట్రైనింగ్ చీఫ్ సాయి, డి. చెన్నారెడ్డి, కార్యదర్శి ఉమా, తదితరులున్నారు.

చంపావతి నదిలో దిగవద్దు..



సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ సుదర్శనరావు

నెల్లిమర్ల: పట్టణంతో పాటు గ్రామాల్లో ప్రవహిస్తున్న చంపావతి నది ఉధృతంగా ఉందని, ఎవ్వరూ నదిలో దిగవద్దని తహసీల్దార్ పి. సుదర్శనరావు అన్నారు. పట్టణంలోని రామతీర్థం వంతెన వద్ద చంపావతి నది ప్రవాహాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. నది వద్ద వీఆర్‌ఓలు, సహాయకులు, పోలీసులు కాపాలాగా ఉండాలని ఆదేశించారు. అలాగే నది ప్రవహిస్తున్న గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వాహన చోదకులకు తప్పని ఇక్కట్లు



రాజాపులోవ జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న వాహన చోదకులకు సూచనలిస్తున్న పోలీస్ సిబ్బంది

భోగాపురం: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని రాజాపులోవ వద్ద జాతీయ రహదారి మీదుగా నీరు ప్రవహిస్తోంది. దీంతో ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగించడానికి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న చెరువు చిన్నపాటి వర్షానికి కూడా పొంగి ప్రవహిస్తోందని సర్పంచ్ కిలారి స్వప్న తెలిపారు. ఈ చెరువు పక్కనే ఓ ప్రైవేట్ లే అవుట్ ఉందని, దానిచుట్టూ ప్రహరీ నిర్మించడంతో చెరువు నీరు రోడ్డుపైకి వస్తోందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెరువు నీరు రోడ్డుపైకి రాకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోరారు.

• మా పల్లె అందాలు...



ప్రకృతి మనోహరంగా కనిపిస్తున్న గొడిపాలెం పాలగెడ్డ రిజర్వాయర్

పల్లెలంటేనే ప్రకృతి.. ఎటుచూసినా పచ్చని పైర్లు, చెట్లు కనువిందు చేస్తుంటాయి..పక్షుల కిలకిలారావాలు..పచ్చని పైర గాలితో మనసుకు ఉత్తేజాన్ని కలిగిస్తాయి.. అటువంటి పల్లెల అందాలు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రెట్టింపయ్యాయి. భూమికి పచ్చని రంగేసినట్లు పైర్లు.. దట్టమైన మేఘాలతో ఆకాశం ముచ్చటగొలుపుతున్నాయి.

– డెంకాడ



ఒమ్మిపేట ప్రాంతంలో పచ్చని వరిపైరు



పొంగి ప్రవహిస్తున్న రిజర్వాయర్ వద్ద చేపలు పడుతున్న స్థానికులు

గుండం చెరువు పరిశీలన



గుండం చెరువును పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాధిక, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, తదితరులు

పూసపాటిరేగ: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో గల గుండం చెరువును ఎంపీడీఓ ఎం. రాధిక సోమవారం పరిశీలించారు. చెరువు పూర్తిగా నిండడంతో ఏ క్షణం అయినా గండి పడవచ్చని భావించి ముందస్తు చర్యలకు ఉపక్రమించారు. ఆమెతో పాటు ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, కార్యదర్శి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

ముంపు పంట పొలాలు ఇవే..

మండల పరిధిలో రెండు రోజులుగా కురిసిన వర్షాలకు నాలుగు గ్రామాలలో వరి పంట ముంపునకు గురైందని ఎంపీడీఓ రాధిక తెలిపారు. కుమిలిలో 83 ఎకరాలు, చౌడువాడలో 33 ఎకరాలు, గోవిందపురంలో 25 ఎకరాలు, చల్లవానితోటలో 8 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు గుర్తించినట్లు ఏఓ కె. నీలిమ చెప్పారు.

☛ వరి పైర్ల పరిశీలన

నెల్లిమర్ల రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని కొత్తపేట, సీతారామునిపేట గ్రామాల్లో నీట మునిగిన వరి పంటలను ఏఓ పూర్ణిమ సోమవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. పొలాల్లోని నీటిని కాలువల ద్వారా బయటకు పంపించాలని సూచించారు. అనంతరం యూరియా, పొటాష్ 30 కిలోల చొప్పున ఎకరాకు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీని సందర్శించిన డిప్యూటీ డీఈఓ



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ రమణ

నెల్లిమర్ల: పట్టణంలోని మిమ్స్ సమీపంలో ఉన్న కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయాన్ని డిప్యూటీ డీఈఓ కేవీ రమణ సోమవారం సందర్శించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాఠశాల ప్రాంగణంలో పెద్ద ఎత్తున నీరు చేరింది. పరిస్థితి ముందే గ్రహించిన విద్యాశాఖాధికారులు విద్యార్థినులను రెండు రోజుల ముందే ఇళ్లకు పంపించారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ డీఈఓ పాఠశాలకు చేరుకుని ప్రిన్సిపాల్ ఉమాతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంఈఓ యు. సూర్యనారాయణమూర్తి ఉన్నారు.

ఫలితాలనిస్తున్న కాల్‌సెంటర్



నీటి మళ్లింపు పనులు చేపడుతున్న సిబ్బంది

విజయనగరం: వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించేందుకు నగరపాలక సంస్థ అధికారులు చేపడుతున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించాలనే ఉద్దేశంతో కార్యాలయంలో కాల్‌సెంటర్ ఏర్పాటు చేశారు. ప్రజలు తెలియజేసిన సమస్యలను కమిషనర్ పి. నల్లనయ్య ఆదేశాలతో సిబ్బంది ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. ఇప్పటి వరకు ఐదు ఫిర్యాదులు అందగా.. వాటిని వెంటనే పరిష్కరించారు. వైఎస్సార్ నగర్, వై జంక్షన్, మయూరి జంక్షన్, భగవాన్ నగర్ ప్రాంతాలలో వర్షపు నీరు నిలిచిపోయిందని ఫిర్యాదులు అందగా.. వెంటనే నీటిని మళ్లించారు. అలాగే గోకపేట ప్రాంతంలో వీధి దీపాలను ఏర్పాటు చేశారు. సమస్యలను కాల్ సెంటర్ నంబర్ 98499 06486కు ఫోన్ చేసి తెలియజేయాలని కమిషనర్ నల్లనయ్య కోరారు.

తీర ప్రాంతాల్లో వైద్యశిబిరాలు



చేపలకంచేరులో వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా వైద్య శాఖాధికారి భాస్కరరావు

భోగాపురం: మండలంలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పోలిపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సముద్రతీర ప్రాంతాలైన ముక్కాం, చేపలకంచేరు గ్రామాల్లో సోమవారం వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. ఆయా వైద్యశిబిరాలను జిల్లా వైద్యశాఖాధికారి భాస్కరరావు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. వర్షాలకు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట వైద్యులు తిరుపతిస్వామి, వెంకటేష్, బి.దివ్య, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వర్షాలతో వరి పంటకు మేలు



పినతాడివాడలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు, తదితరులు

డెంకాడ: రెండు రోజులుగా కురిసిన వర్షాలతో వరి పంటకు మేలు జరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు అన్నారు. మండలంలోని పినతాడివాడలో సోమవారం ఆయన పర్యటించి వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇష్టానుసారంగా రసాయన ఎరువులు వినియోగించవద్దని సూచించారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు ఎరువులు వాడాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పూడి నిర్మల, సర్పంచ్ లెంక లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ పల్లె భాస్కరరావు, వీఏఏ కిరణ్మయి, రైతులు పాల్గొన్నారు.

సూర్యతేజ అకాడమీకి అవార్డుల పంట



వరల్డ్ రికార్డ్ ప్రశంసాపత్రం, మెడల్స్, సర్టిఫికెట్లతో సూర్యతేజ అకాడమీ డైరెక్టర్ సౌభాగ్యలక్ష్మి, విద్యార్థులు

విజయనగరం టౌన్: ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన వారణాశిలో నమోఘాట్ వద్ద కూచిపూడి, భరతనాట్యం, కథక్‌లలో ఐసీఎమ్‌డీఏ సంస్థ ఇటీవల ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లాకు చెందిన సూర్యతేజ డ్యాన్స్ అకాడమీ డైరెక్టర్ ఎం.సౌభాగ్యలక్ష్మి బృందానికి అవార్డుల పంట పండింది. ఈ సందర్భంగా సోమవారం ఆమె అకాడమీలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. భరతనాట్యం, కూచిపూడి, కథక్ విభాగాల్లో 30 మంది విద్యార్థులతో కలిసి ఈ నెల ఒకటో తేదీన ప్రదర్శనలు ఇచ్చామన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శనలలో పాల్గొనగా.. తమ అకాడమీకి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు లభించిందన్నారు. వరల్డ్ రికార్డ్‌తో పాటు మెడల్స్, పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను ప్రముఖ మృదంగ విద్వాన్, పద్మభూషణ్ గ్రహీత యెల్లా వెంకటేశ్వరరావు, ఘంటసాల కోడలు పార్వతీరవి ఘంటసాల, ఈఆర్ జనార్దన్‌ల చేతుల మీదుగా అందుకున్నామన్నారు.

బాధితులను ఆదుకోవాలి..



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

పూసపాటిరేగ: విజయవాడ వరద బాధితులను ప్రభుత్వ పెద్దలు తక్షణమే ఆదుకోవాలని నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేపట్టి ఆర్థికంగా నష్టపోయిన వారికి పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. వరదలు ఇప్పుడిప్పుడే తగ్గుముఖం పట్టినందున పారిశుధ్య కార్యక్రమాలు పక్కాగా నిర్వహించాలన్నారు. మృతి చెందిన వారి వివరాలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో తెలియకపోవడం ప్రభుత్వం పనితీరుకు అద్దం పడుతోందని ఎద్దేవా చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం కేవలం ఐదు లక్షల రూపాయలు ఇచ్చి చేతులు దులుపుకోవాలనుకోవడం సరికాదన్నారు. కేంద్రం నుంచి తక్షణమే నిధుల మంజూరుకు ప్రభుత్వం కృషి చేయాలని తెలిపారు. కూటమి నాయకులు ప్రతిపక్షాలపై విమర్శలు మానుకుని బాధితులకు అండగా నిలవాలని హితవు పలికారు. బాధితులే స్వయంగా మీడియా ముందుకు వచ్చి తమ కష్టాలను చెప్పుకోవడం బాధాకరమన్నారు. కొంతమంది ఆస్తులు కాపాడాలనే ఉద్దేశంతో బుడమేరు రిజర్వాయర్ నీటిని విజయవాడ వైపు వదిలేశారని ఆరోపించారు. రాజధానిగా చెప్పుకుంటున్న ప్రాంతంలో ఎనిమిది రోజులైన పరిస్థితిని అదుపులోకి తీసుకురాలేకపోయారంటే ప్రభుత్వ పాలన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని ఎద్దేవా చేశారు.

ముంపుపై ఆరా ..



ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అతిథి గజపతిరాజు, అధికారులు, తదితరులు

విజయనగరం: నగరంలో రెండు రోజులుగా కురిసిన వర్షాల వల్ల ముంపునకు గురైన ప్రాంతాలను విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అతిథి గజపతిరాజు అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ముందుగా ఎల్ఐసీ బిల్డింగ్ వద్దనున్న పెద్ద చెరువు అవుట్ ఫ్లో ప్రాంతాన్ని పరిశీలించారు. ఆ తర్వాత వినాయకనగర్ ప్రాంతంలో పర్యటించారు. అలాగే పద్మావతినగర్ ఫస్ట్‌లైన్ ప్రాంతం, మజ్జిపేట, అయ్యన్నపేట ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. అల్పపీడన ద్రోణి ప్రభావంతో పది రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిశాయన్నారు. ఇందులో భాగంగా నగరంలో కురిసిన వర్షాలకు ముంపునకు గురైన ప్రాంతాలను త్వరితగతిన అభివృద్ధి చేస్తామని చెప్పారు. విజయవాడలో ముంపు ప్రాంతాలను సరి చేసేందుకు నగరపాలక సంస్థ సిబ్బందిని కూడా తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు మధుసూదనరావు, అమ్మాజీరావు, డీఈ అప్పారావు, టీపీఆర్‌ఓ సింహాచలం, టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, కనకల మురళీమోహన్, ప్రసాదుల లక్ష్మీప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన పంట పొలాలు



పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

భోగాపురం: వర్షాల కారణంగా నీట మునిగిన వరి పంట పొలాలను మండల ప్రత్యేకాధికారి సుధారాణి, ఏఓ హరికృష్ణ సోమవారం పరిశీలించారు. సుమారు 50 ఎకరాల్లో పంట నాశనమైనట్లు అధికారులు గుర్తించారు. పరిశీలనలో తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ అప్పలనాయుడు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేత్రదానం మహాదానం..

• రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ ప్రసాదరావు



కార్నియా సేకరిస్తున్న ఐ డోనేషన్ సెంటర్ టెక్నీషియన్

విజయనగరం ఫోర్ట్: నేత్రదానం మహాదానమని రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ కేఆర్‌డీ ప్రసాదరావు అన్నారు. ఉడాకాలనీ ఫేజ్-3కి చెందిన ఎస్. రామారావు అనే వ్యక్తి సోమవారం మరణించారు. విషయం తెలుసుకున్న కొండవెలగాడ పీహెచ్‌సీ అప్తాలమిస్ట్ జి. వెంకటేశ్వరావు వారి కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించి ఒప్పించారు. వెంకటేశ్వరావు నేత్రాలు సేకరించేందుకు రెడ్‌క్రాస్ సొసైటీ ఐ డోనేషన్ సెంటర్‌కు సమాచారం అందించడంతో వారు వచ్చి కార్నియా సేకరించారు.

ఇబ్బందుల్లేకుండా చూడండి..

నెల్లిమర్ల: నగర పంచాయతీ ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ బంగారు సరోజిని ఆదేశించారు. సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో తుఫాన్ ప్రభావంపై కమిషనర్ టీవీఎస్ విశ్వేశ్వరరావు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తుఫాన్ కారణంగా నగర పంచాయతీలోని చెరువులు, నదీ పరీవాహక ప్రాంతాల వైపు ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య కార్యక్రమాలు పక్కాగా చేపట్టాలని తెలిపారు. అనంతరం ముంపు ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమాభాస్కర్, ఏఈలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ సరోజిని